ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

3

విజయనగరం

జిల్లా వార్తలు

శనివారం 29 మార్చి 2025





మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్


తాగునీటి సమస్య తలెత్తకూడదు

- 'ఉపాధి' వేతనదారుల పని గంటలు మార్చాలి
- పాఠశాలల్లో ప్రతి రెండు గంటలకు వాటర్ బెల్
- కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశం

విజయనగరం కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ఉన్న బోరుబావులను తనిఖీ చేయాలని, పని చేయని వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. వేసవి ప్రణాళికను ఇప్పటికే వేసుకున్నట్లు చెప్పారు. 'విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. ఏప్రిల్, మే నెలల్లో వేసవి తీవ్రత అధికంగా ఉండి, వడగాల్పులు వీచే అవకాశం ఉంది. ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవి తాపానికి గురి కాకుండా కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి. తాగునీరు, మజ్జిగను ఉంచాలి. అవి కలుషితం కాకుండా చూసుకోవాలి. ఉపాధి పనులు చేసే కూలీలకు ఎండ తీవ్రత తగలకుండా పని వేళలను మార్చాలి. ఉదయం 6.30 గంటల నుంచి 9.30 గంటలకు లోపు, సాయంత్రం 5 నుంచి 7 గంటల లోపు పని చేసేలా చూడాలి. పని చేసే చోట నీడ కోసం షామియానాలు వేయాలి. పశువులకు గ్రాసం సమస్య లేకుండా చూడాలి. ఉపాధి వేతనదారుడికి సరాసరి వేతనం రూ.300 అందేలా చూడాలి. వేసవిని దృష్టిలో పెట్టుకుని పాఠశాలల్లో ప్రతి రెండు గంటలకు ఒక సారి వాటర్ బెల్ కొట్టాలి. ఈ నెల 30, 31 తేదీల్లో సెలవులు ఉన్నందున ఏప్రిల్ నెలకు సంబంధించిన పింఛన్ సొమ్మును 29న విత్‌డ్రా చేసి, 1న తేదీన ఉదయం 7 గంటలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీనివాస్ మూర్తి పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

5 లో



చీపురుపల్లిలో చోరీ

- అర కిలో వెండి సామగ్రి
- రూ.25 వేలు అపహరణ

5 లో

- గతంలో ఎన్నడూ లేని విధంగా భూ సమస్యలు ఉన్నాయి. వీటి పరిష్కారానికి గత కొన్ని నెలలుగా ప్రయత్నిస్తున్నాం. అయినా ఇంకా కొలిక్కిరావడం లేదు. రెవెన్యూ వ్యవస్థ ఇప్పటికీ కంట్రోల్‌లోకి రాలేదు. ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల భూ సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపాలో నెలరోజుల్లోగా అధ్యయనం చేసి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయండి.

- రెండు రోజుల కిందట జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు



లక్కవరపుకోట మండలం దాసుల్లుపాలెంలో ఉన్న హెల్డోవర్ భూములు



హెల్డోవర్ సమస్య పరిష్కారమయ్యేనా?

- భూ యాజమాన్య హక్కులకు నోచుకోని రైతులు
- జిల్లాలోని ఐదు మండలాల్లో 479 ఎకరాలు గుర్తింపు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- అసెంబ్లీలో ఇప్పటికే ప్రస్తావించిన ఎమ్మెల్యే లలితకుమారి
- ప్రభుత్వంపైనే ఆశలు

శృంగవరపుకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు మండలాల్లో హెల్డోవర్ భూములు ఉన్నాయి. 479.23 ఎకరాల భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారుల గణంకాలను బట్టి తెలుస్తుంది. శృంగవరపుకోట మండలం కొత్తకోట గ్రామంలో 35 ఎకరాలు, గజపతినగరం మండలం పురిటిపెంటలో 268.16, గుర్ల మండలం నాగళ్లవలసలో 140.30, లక్కవరపుకోట మండలం దాసుల్లుపాలెంలో 31.10, కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామంలో 4.67 ఎకరాల హెల్డోవర్ భూములను రైతులు సాగు చేస్తున్నారు. ఈ రైతుల ఎవరికీ భూ యాజమాన్య హక్కులు లేవు. పంట పండించుకోవడం తప్ప రికార్డుల్లో ఎక్కడ వీరి పేర్లు లేవు. తరతరాల నుంచి సాగు చేస్తున్నప్పటికీ కుటుంబంలోని ఎవరి పేర్లు రికార్డుల్లో నమోదు కాలేదు. స్వాతంత్ర్యం తరువాత జరిగిన భూ సర్వే సమయంలో ఈ గ్రామాలకు చెందిన రెవెన్యూ రికార్డుల్లో అనుభవదారు పేరు వద్ద హెల్డోవర్ అని రాసి ఉంది. అప్పట్లో వివరాలను సక్రమంగా చెప్పని భూముల వద్ద డాట్‌లు (చుక్కలు), ఇంటులు వంటి వాటిని పెట్టారు. రాష్ట్రంలో పలు జిల్లాలో చుక్కల భూముల సమస్యలు ఉన్నాయి. ఈ విధంగానే జిల్లాలో హెల్డోవర్ అని రాశారు. ఇవి ప్రభుత్వానికి చెందినవి కావని, జిరాయితీ భూములని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కానీ, సాగు చేస్తున్న రైతులకు మాత్రం భూ యాజమాన్య హక్కులను కల్పించలేకపోతున్నారు. 20 ఏళ్లు దాటిన అసైన్డ్, చుక్కల భూములకు గత వైసీపీ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. దీంతో హెల్డోవర్ భూములను సాగు చేస్తున్న రైతులు అప్పటి ప్రజా ప్రతినిధుల దృష్టిలో ఈ సమస్యను పెట్టారు. పరిష్కారం చూపుతామని రైతులకు ఆశ

(మిగతా 6వ పేజీలో..)



- ఈ రైతు పేరు శీరంశెట్టి రాము. లక్కవరపుకోట మండలం దాసుల్లుపాలెం గ్రామం. రెండు తరాల నుంచి సాగు చేస్తున్న 30 సెంట్ల భూమికి యాజమాన్య హక్కు కల్పించకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాడు. గత కొన్నేళ్లుగా యాజమాన్య హక్కు కోసం రెవెన్యూ అధికారులతో పాటు గ్రామానికొచ్చిన ప్రతి అధికారి వద్ద ప్రస్తావి స్తున్నాడు. అయినా ఫలితం శూన్యం. ఈ గ్రామంలో దాదాపు 50 మంది రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. వీరందరికీ యాజమాన్య హక్కులు కల్పిస్తామని గత వైసీపీ ప్రభుత్వం నమ్మబలి కింది. ఎన్నికల వరకు చుట్టూ తిప్పించుకున్న వైసీపీ నేతలు చివరకు మొండి చేయిచూపారు. దీంతో సమస్య మొదటికి వచ్చింది. భూ సమస్యల పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపుతుండడంతో హెల్డోవర్ భూములకు న్యాయం జరుగుతుందన్న ఆశ రైతుల్లో కనిపిస్తుంది.



- శృంగవరపుకోట నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో హెల్డోవర్ అని నమోదు చేశారు. దీంతో ఈ భూములపై రైతులకు యాజమాన్య హక్కు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట ఫలాన్ని మాత్రమే పొందగలుగుతున్నారు. సాగులో ఉన్న ఈ భూములకు హక్కులు కల్పించండి.

- ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

తొలి నుంచీ టీడీపీకి 'విజయ'మే!

- జిల్లాలో తరగని ఆదరణ
- అప్పట్లో ఎన్టీఆర్ విస్తృత పర్యటన
- విద్యావంతులకు రాజకీయాల్లోకి ఆహ్వానం
- 'అన్నగారి' పిలుపుతో ఎంతోమంది అరంగేట్రం
- నేడు టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం

4 లో



బీసీ కార్పొరేషన్ రుణాలకు 19,616 దరఖాస్తులు

- జిల్లా వ్యాప్తంగా 3,379 యూనిట్ల లక్ష్యం
- ఆన్‌లైన్ నమోదుకు తక్కువ సమయం
- అధికశాతం అభ్యర్థులు దూరం

4 లో



సారాపై ప్రత్యేక నిఘా

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

4 లో

హైవేపై వాహనాల పార్కింగ్

- రోడ్డుపై వెలగని విద్యుద్దీపాలు
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు
- ట్రాఫిక్‌కూ అంతరాయం

5 లో

2 కోట్లే ఇచ్చారు

- గ్రోత్ సెంటర్‌లో మౌలిక వసతుల కోసం కేటాయింపు
- ఈ నిధులు ఏ మూలకు సరిపడతాయని పెదవి విరుపు
- ధ్వంసమైన రహదారులు
- పన్ను సక్రమంగా చెల్లించని పరిశ్రమలు



బొబ్బిలిలోని ఏపీఐఐసీ గ్రోత్‌సెంటర్

బొబ్బిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని ఏపీఐఐసీ గ్రోత్ సెంటర్‌లో మౌలిక వసతుల కల్పన కోసం ఎట్టకేలకు రూ.2కోట్లు మంజూరయ్యాయి. అధికారులు రూ.5 కోట్లుకు పైగా నిధుల కోసం ప్రతిపాదనలు పంపితే రూ.2కోట్లు మాత్రమే మంజూరు చేయడంపై పరిశ్రమల నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్టు వాహనదారులు పెదవి విరుస్తున్నారు. ఈ నిధులు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఏపీ ఐఐసీ పరిపాలనా కార్యాలయంతో పాటు గ్రోత్‌సెంటర్‌లోని రోడ్లన్నీ పూర్తిగా ఛిద్రమయ్యాయి. దీంతో భారీ బరువులతో రాకపోకలు సాగించే వాహనాలు రహదారులపై కూరుకుపోతున్నాయి. రోడ్ల అభివృద్ధితో పాటు ఇతర పనుల కోసం రూ.5 కోట్లకు పైగా నిధులు కావాలని అధికారులు గత మూడేళ్లుగా ప్రతిపాదనలు పంపించారు. అయితే, రూపాయి కూడా మంజూరు కాలేదు. ఇప్పుడు రూ.రెండు కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులతో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమేనా అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరోపక్క వేగావతి నది నుంచి నీటిని పరిశ్రమలకు సరఫరా చేసే వ్యవస్థకు సంబంధించి ఎటువంటి పారదర్శకతను పాటించడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. పరిశ్రమల నిర్వాహకులు కూడా ఆస్తిపన్నును సక్రమంగా చెల్లించడం లేదు.

కానరాని ప్రగతి

బొబ్బిలి ప్రాంతానికి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటర్ పారిశ్రామిక మణిహారం అవుతుందని అందరూ భావించారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా గ్రోత్‌సెంటర్‌లో ప్రగతి కానరావడం లేదు. బొబ్బిలి పూర్తి మెట్ట ప్రాంతం. వర్షాలు కురిస్తేనే పంటలు పండుతాయి. లేదంటే కరువు కోరలు చాస్తుంది. ఈ నేపథ్యంలో 30 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం గ్రోత్‌సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం అడిగిందే తడవుగా ఏకంగా 1,140 ఎకరాల భూములను రైతులు కారుచౌకగా కట్టబెట్టారు. బొబ్బిలి పట్టణానికి ఆనుకొని ఉన్న మెట్టవలస, గున్నతోటవలస, గొర్లెసీతారాంపురం, నారాయణప్పవలస, కాశిందొరవలస, ఎం.బూర్జివలస, పనుకువలస గ్రామాలకు చెందిన రైతుల నుంచి సేకరించిన భూముల్లో గ్రోత్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటీ రాలేదు. ఫెర్రోఎల్లాయిస్, హెరిటేజ్ వంటి నాలుగైదు పరిశ్రమలు తప్పితే మిగిలిన యూనిట్లు ఏవీ రాలేదు. 150 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో టీకే స్టీల్స్, మోయర్స్ వంటి భారీ పరిశ్రమలు వస్తాయని చాలా ఏళ్లు ఎంతో ఆశగా ఎదురు చూశారు. రకరకాల సాంకేతిక కారణాలతో ఆ రెండూ పూర్తిగా రాలేదు. సర్వీసు యూనిట్లు వంటివి, చిన్నపాటి పరిశ్రమలు తప్ప పెద్దగా ఉపాధిని కల్పించే పరిశ్రమలు ఏవీ రాలేదు. బాగా నడిచిన కొన్ని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు బ్యాంకు రుణాలు, ఇతరత్రా మేనేజ్‌మెంట్ సమస్యల కారణంగా మూతపడ్డాయి.

కొట్టక్కిలో ఎంఎస్‌ఎంఈ పార్కు..

నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో..)

మానవతా దృక్పథంతో కేసులు పరిష్కరించాలి

- పెండింగ్ భారాన్ని తగ్గించాలి
- జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణచక్రవర్తి

విజయనగరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాల్లో ఉన్న కేసులను మానవతా దృక్పథంతో పరిశీలించి, ఉభయ పార్టీల ద్వారానే పరిష్కారం రాబట్టాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయికల్యాణ చక్రవర్తి అన్నారు. జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకపై మధ్యవర్తిత్వం ద్వారా కేసులను తొందరగా పరిశీలించి పెండింగ్ భారాన్ని తగ్గించాలన్నారు. దీనివల్ల ఉభయ పార్టీలకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందన్నారు. అలాగే కోర్టులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం దొరుకుతుందన్నా రు. కేసుల పరిష్కారానికి రాజీ కూడా ఒక మార్గమని అన్నారు. శిక్షణ ఇచ్చిన మాస్టర్ ట్రైనీలు షేక్ మహ్మద్ షీరాజ్, ఆర్.రత్నతారను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి కల్యాణచక్రవర్తి

బొబ్బిలి ఏఎంసీ ఛైర్మన్‌గా నర్సుపల్లి



బొబ్బిలి/తెర్లాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా తెర్లాం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఏఎంసీలకు ఛైర్మన్లను నామినేట్ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందిస్తున్న వెంకటనాయుడుకు కూటమి ప్రభుత్వంలో సముచితస్థానం దక్కింది. 1985 నుంచి నేటి వరకు మధ్యలో ఓ రెండేళ్లు మినహా మొత్తం కాలమంతా ఆయన తెర్లాం మండల టీడీపీ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. 1995లో తెర్లాం సర్పంచ్‌గా, 1986లో తెర్లాం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా, బాడంగి, తెర్లాం, మెరకముడిదాం మండలాల సీటీతీరువా అధ్యక్షుడిగా పనిచేశారు. దివంగత ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్‌కు ముఖ్య అనుచరునిగా కొనసాగిన ఆయన ఇప్పుడు బొబ్బిలి రాజులకు, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడుకు విశ్వసనీయ అనుచరునిగా ఉన్నారు. టీడీపీ అభిప్రాయసేకరణ ద్వారా నర్సుపల్లికి బొబ్బిలి ఏఎంసీ పదవిని కట్టబెట్టింది. వెంకటనాయుడు నియామకంపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు సేవ చేస్తా: నర్సుపల్లి

బొబ్బిలి ఏఎంసీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించడం ఆనందంగా ఉంది. రైతులకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించినట్లుగా భావిస్తున్నాను. ఎమ్మెల్యే బేబీనాయన, మాజీమంత్రి సుజయ్‌కృష్ణరంగరావు, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడుకు కృతజ్ఞతలు. మా నాయకుల సూచనలు, సలహాలతో వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. నియోజకవర్గ పరిధిలోని రైతులందరికీ మరింత ప్రయోజనకరంగా ఏఎంసీని తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తా. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది.

తొలి నుంచీ టీడీపీకి విజయమే



- జిల్లాలో తరగని ఆదరణ
- అప్పట్లో ఎన్టీఆర్ విస్తృత పర్యటన
- విద్యావంతులకు రాజకీయాల్లోకి ఆహ్వానం
- 'అన్నగారి' పిలుపుతో ఎంతోమంది అరంగేట్రం
- నేడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

విజయనగరం/పార్వతీపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు... ఈ పేరు సినీ రంగంలో ఎంత సంచలనమో... తెలుగుదేశం పార్టీ పేరు రాజకీయ రంగంలో అంతే సంచలనం. 1982 మార్చి 29న ఎన్టీఆర్.. తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ఆ సమయంలో రోజురోజుకూ ఎన్టీఆర్‌కి.. టీడీపీకి పెరుగుతున్న ఆదరణను చూసిన పాలకులు వెంటనే ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. అది కూడా ఆయనకు వరమైంది. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టి...రికార్డు సృష్టించారు. తొలిసారి ఎన్నికల్లో జిల్లాలోని 12 నియోజకవర్గాలకు గాను 10 చోట్ల ఇక్కడి ప్రజలు టీడీపీకి అఖండ విజయాన్ని అందించారు. నాటికీ నేటికీ అదే స్థాయి ఆదరణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

విజయనగరంలో ఇలా..

విద్యావంతులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన ఎన్టీఆర్... విజయనగరంలో పీవీజీ రాజు కుటుంబ సభ్యులైన ఆనంద గజపతిరాజు, అశోక్ గజపతిరాజును అప్పట్లో పార్టీలోకి ఆహ్వానించారు. కోళ్ల అప్పలనాయుడు తదితరులు అప్పటికే ఇతర పార్టీల్లో ఎమ్మెల్యేలుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉత్తరావల్లి నియోజకవర్గం నుంచి కోళ్ల అప్పలనాయుడు, విజయనగరం నుంచి ఆనందగజపతిరాజు, బొబ్బిలి నుంచి శంబంగి వెంకటచినప్పలనాయుడు, భోగాపురం నుంచి పతివాడ నారాయణస్వామి నాయుడు, కిమిడి కళా వెంకటరావు ఇలా అనేక మంది క్రమక్రమంగా టీడీపీ బాట పట్టారు. పార్టీలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. అశోక్ గజపతిరాజు అటు ఎన్టీఆర్, ఇటు చంద్రబాబు ఇద్దరి క్యాబినెట్లలోనూ మంత్రి పదవులు చేపట్టారు.

'బొబ్బిలిపులి' తరువాత..

1982 జనవరి 9న 'బొబ్బిలిపులి' చిత్రం విడుదలైంది. విజయనగరం లోని మినర్వా థియేటర్‌లో ఆ చిత్రం విడుదలైంది. ఆ మరుసటి రోజే ఎన్టీఆర్ విజయనగరంలో పర్యటించారు. దీంతో అభిమానులు ఉవ్వెత్తున తరలివచ్చారు. అక్కడికి రెండు నెలలకే మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. అప్పటికే ఎన్టీఆర్ అభిమాన సంఘ నాయకులు సత్యమూర్తి (ఆడిటర్), ఐవీపీ రాజు, గెద్ద రామలింగస్వామి, కనకల మురళీమోహన్, ముచ్చి రామలింగస్వామి, బాబులు, మూర్తి ఇలా కొంత మంది టీడీపీ ఆవిర్భావంతో విజయనగరం జిల్లాలో ఎన్టీఆర్ యువసేనగా మారిపోయారు. ఎన్టీఆర్ పర్యటనలో వీరంతా భాగస్వాములయ్యారు.

ఎన్టీఆర్ సభలతో...

నగరంలోని ఆయోధ్య మైదానం, సిటీబస్టాండ్ వద్ద ఎన్టీఆర్ ప్రచార సభలు జరిగాయి. ఎన్టీఆర్ సభలకు అశేషంగా జనాలు తరలివచ్చారు. పోలీసుల రక్షణలో కాకుండా ఎన్టీఆర్ అభిమానుల రక్షణలో ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడిక్కడ జనాదరణ లభించడంతో ఎన్టీఆర్ ఉప్పొంగిపోయారు. అదే ఉత్సాహంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అశోక్ బంగ్లా, ప్రేమసమాజం తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ బస చేశారు. ప్రచారం ముగించుకుని రాత్రి 11 గంటలకు ఆయన నిద్రించినా.. తెల్లవారుజామున 5 గంటలకే తిరిగి చైతన్యరథంపై పయనమయ్యేవారు. ఉదయం 5 గంటలకే ఎన్టీఆర్‌ని చూసేందుకు జిల్లా ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చేవారు. అనంతర కాలంలో ఆ అభిమానమే జిల్లాలో తెలుగుదేశం పార్టీకి తిరుగులేని విజయాన్ని కట్టబెట్టింది. 43 ఏళ్లుగా అదే ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలో పార్టీ ముందుకు వెళుతోంది.

అదే స్థాయిలో ఆదరణ

పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ రోజురోజుకూ తెలుగుదేశం పార్టీకి ఆదరణ పెరుగుతూనే ఉంది. ఇందులో భాగంగా ఏటా క్రమం తప్పకుండా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం... సంస్థాగత ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తూ వస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు... అది పూర్తయిన తరువాత క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ పార్టీ కమిటీలు ఏర్పాటు వంటివి జరుగుతున్నాయి. క్రమం తప్పకుండా ఈ రెండు ప్రక్రియలు నిర్వహిస్తున్న రాజకీయ పార్టీ టీడీపీయేనని నాయకులు బలంగా చెబుతుంటారు. వివిధ కారణాలతో నాయకులు పార్టీలు మారుతున్నా..ప్రజలు, కార్యకర్తలు మాత్రం టీడీపీతోనే ఉంటున్నారు. పార్టీ కూడా కార్యకర్తల కోసం ప్రత్యేకంగా బీమాను అమలు చేస్తుండడం గమనార్హం.

ఆ కుటుంబం తెలుగుదేశంతోనే..



ఎన్టీఆర్‌తో మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు (ఫైల్)

శృంగవరపుకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో అధినేత నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్)తో కలిసి నడిచిన తొలితరం నాయకుల్లో కోళ్ల అప్పలనాయుడు ఒకరు. ఆయన ఉత్తరాపల్లి నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు శాసన సభ్యుడిగా వ్యవహరించారు. 1982లో పార్టీని స్థాపించినప్పుడు ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు అప్పలనాయుడుకు ఎన్టీఆర్ అవకాశం ఇచ్చారు. 1983లో జరిగిన పార్టీ తొలి ఎన్నికల్లో అప్పటి రాష్ట్ర మంత్రి కె.వి.ఆర్.పి.ఎస్.పి.రాజుపై కోళ్ల గెలిచారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్‌ను నాదెండ్ల భాస్కరరావు పదవికి దూరం చేసినపుడు ఎన్టీఆర్‌కు అండగా నిలబడ్డారు. 1999 వరకు ఈ నియోజకవర్గం నుంచి వరుస విజయాలు అందుకున్నారు. అప్పటి నుంచి ఆయన కుటుంబం టీడీపీతోనే నడుస్తోంది. ఎన్టీఆర్ మరణానంతర కాలంలో 2009లో ఉత్తరాపల్లి నియోజకవర్గం రద్దయింది. అప్పలనాయుడు వృద్ధాప్యం కారణంగా... జనరల్‌గా మారిన శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆయన మనమరాలు, కోడలు లలిత కుమారికి టీడీపీ అధినేత చంద్రబాబు టికెట్ కేటాయించారు. అప్పటి నుంచి నాలుగుసార్లు ఆమెకే టికెట్ కేటాయించారు. లలిత కుమారి భర్త కె.బి.ఎ.రామప్రసాద్ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.



చంద్రబాబుతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఎస్.కోట టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి (ఫైల్)



ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న ఎన్టీఆర్ (ఫైల్)



ఎన్టీఆర్‌తో మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు (ఫైల్)

అప్పట్లో టిక్కెట్ కేటాయించారు



1983లో నాగూరు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఎన్టీ రామారావు నాకు కల్పించారు. స్వల్ప ఓట్లతో ఓడిపోయినప్పటికీ నా తండ్రి వెంపటాపు సత్యం పట్ల ఉన్న అభిమానాన్ని నాపై చూపించేవారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. అప్పట్లో భద్రగిరి ఐటీఐ, బాలుర గురుకుల పాఠశాలను ఎన్టీఆర్ ప్రారంభించారు. కోటపాడులో హార్టికల్చర్ నర్సరీ, శిక్షణా సంస్థను ప్రారంభించారు. గిరిజనులతో సహపంక్తి భోజనం చేసిన ఎన్టీఆర్ జ్ఞాపకాలు నాతోపాటు మా గిరిజన ప్రాంతాల ప్రజల్లో నేటికీ ఉన్నాయి.

- వెంపటాపు భారతి, సమితి మాజీ అధ్యక్షురాలు

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే..



ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చాను. చీపురుపల్లిలో ఎన్టీఆర్ నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంతో పాటు గండిపేటలో నిర్వహించిన రాజకీయ శిక్షణ శిబిరాల్లో పాల్గొన్నాను. టీడీపీ ప్రారంభం నుంచి నేటి వరకు తెలుగుదేశంలో కొనసాగుతూ వస్తున్నాను.

- గొట్టాపు వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ, పార్వతీపురం

పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళిక

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు



కమిషనర్ వెంకటేశ్వర్లు

పార్వతీపురం టౌన్, మార్చి 28: పట్టణాభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రశ్న: పట్టణాభివృద్ధికి మీ ప్రణాళికలు ఏంటి?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు మున్సిపల్ సాధారణ నిధులతో పట్టణంలోని 30 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఇప్పటి వరకు రూ.1.82 కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేయగా... ఇంకా రూ.1.89 కోట్లతో వివిధ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

ప్ర: తాగునీటి సరఫరాకు సంబంధించి ఏం చేయబోతున్నారు?

జ: పట్టణ ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. సమ్మర్ ప్లాన్‌లో భాగంగా రూ.30 లక్షలు ఖర్చు చేస్తున్నాం. ప్రతి ఏటా తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు మున్సిపల్ బడ్జెట్‌లో కేటాయిస్తున్నాం.

ప్ర: పారిశుధ్యం మెరుగుకు ఏం చేస్తున్నారు?

జ: గ్రేడ్-1 మున్సిపాల్టీలో గల 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. పారిశుధ్య పనులకు 133 మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికులను వినియోగిస్తున్నాం. 30 వార్డుల్లో రోజుకు 20 టన్నుల చెత్తను తరలించడంతో పాటు స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తున్నాం. స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాం.

ప్ర: వీధి దీపాల సక్రమ నిర్వహణకు తీసుకుంటున్న జాగ్రత్తలు ఏంటి?

జ: మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో గల వీధుల్లో 2,735 వీధి దీపాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు విజయనగరానికి చెందిన ఓ ప్రయివేటు సంస్థ పని చేస్తోంది. వీధి దీపాల నిర్వహణకు ఏడాదికి రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్నాం. వీటిపై వచ్చే ఫిర్యాదులపై గంటలోపే స్పందిస్తున్నాం.

ప్ర: డంపింగ్ యార్డు తరలింపు సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారు?

జ: డంపింగ్ యార్డు తరలింపుపై స్థానిక ప్రజాప్రతినిధులు, పాలక వర్గం సూచనలను పాటిస్తాం. ఇప్పటికే డంపింగ్ యార్డు తరలింపునకు సంబంధించి ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులతో కలసి ప్రత్యేక కార్యచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం.

ప్ర: 30 వార్డుల్లో దోమల నివారణకు చేపడుతున్న చర్యలు ఏంటి?

జ: పట్టణంలోని 30 వార్డుల్లో దోమల నివారణకు ప్రజారోగ్యశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. రోజూ సాయంత్రం వీధుల్లో ఫాగింగ్‌తో పాటు కాలువల్లో దోమల నివారణకు మందు స్ప్రే చేస్తున్నాం.

ప్ర: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ఏం చేస్తున్నారు?

జ: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశాం. మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సహకారంతో ప్రభుత్వ పథకాలు పేదలకు చేరే విధంగా చర్యలు చేపడుతున్నాం.



మండుటెండలో గ్రామానికి నడిచి వెళుతున్న చిన్నారులు

చదువు కష్టాలు..

సీతంపేట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన చిన్నారులకు చదువు కష్టాలు తప్పడం లేదు. కె.జమ్మడుగూడ గ్రామానికి చెందిన 20 మంది చిన్నారులు అర కిలోమీటరు పైగా దూరంలో ఉన్న కె.కాగుమానుగూడ గ్రామంలోని జీపీఎస్ పాఠశాలకు ఇలా ప్రతిరోజూ నడిచి వెళ్లి వస్తుంటారు. శుక్రవారం మధ్యాహ్నం మండుటెండలో రోడ్డు పక్క నుంచి క్యూలైన్‌లో తమ గ్రామానికి వెళ్లడం కనిపించింది. ఇలానే సీతంపేట ఏజెన్సీలో అనేక పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు ఇటువంటి ఇబ్బందులకు ఓర్చి చదువులు సాగిస్తున్నారు.



108 లింగాలకు రుద్రాభిషేకం

కొత్తవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాలలో చివరి నెల ఫాల్గుణ మాస మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం 108 శివలింగాలకు తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని ఓం సదనంలో రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ హోమాలు చేపట్టారు. కార్యక్రమంలో సదనం అర్చకుడు కిరణ్ కుమార్‌శర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సారాపై ప్రత్యేక నిఘా

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

విజయనగరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నియంత్రించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా ముద్దాయిలు, అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామస్థాయి, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రతి గ్రామాన్ని సారా లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఒడిశా అధికారులతో సంప్రదింపులు జరిపి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు.పార్వతీపురం, పాలకొండ, కురుపాం స్టేషన్‌లు నాటుసారాపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మూలించాలన్నారు. సమావేశంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు, ఏఈఎస్‌లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

బీసీ కార్పొరేషన్ రుణాలకు 19,616 దరఖాస్తులు

- జిల్లా వ్యాప్తంగా 3,379 యూనిట్ల లక్ష్యం
- ఆన్‌లైన్ నమోదుకు తక్కువ సమయం
- అధిక శాతం అభ్యర్థులు దూరం

విజయనగరం కలెక్టరేట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు జిల్లా వ్యాప్తంగా 19,616 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మండల, మున్సిపల్ పరిధిలో శుక్రవారం నుంచి ఇంటర్వ్యూ ప్రక్రియ మొదలు పెట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులను వివరాలను ఎంపీడీఓ, కమిషనర్ల లాగిన్ నుంచి సంబంధిత బ్యాంకు మేనేజర్ల లాగిన్‌లోకి పంపిస్తారు. ఇదిలా ఉండగా.. బీసీ, మైనార్టీ, కాపు, వైశ్య , క్షత్రియ, బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, మేదర, కుమ్మరి కులాల యువతీ యువకులు ఉపాధి కోసం రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గత నెలలో ప్రకటన వెలువడింది. ఈసారి కొత్తగా యూనిట్ విలువ నిర్ధారించలేదు. యూనిట్ ఆధారంగా రుణాలు మంజూరు చేస్తారు. అలాగే కొత్తగా జనరిక్ షాపులకు అవకాశం కల్పించారు. ఉత్తరాంధ్ర ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఇవ్వడంతో కోడ్ కారణంగా దరఖాస్తు నమోదు ప్రక్రియ నిలిచింది. ఎన్నికల కోడ్ ఎత్తి వేయడంతో తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ ఈనెల 10వ తేదీ తరువాత మొదలైంది. ఈనెల 22వరకు గడువు ఇచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రాలేదు. దీంతో ఈనెల 25 వరకూ గడువు పెంచారు. జిల్లా వ్యాప్తంగా 19,616 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇవి కూడా ఆశించిన స్థాయిలో లేవని అధికారులు అంటున్నారు.

సామాజికవర్గాల వారీగా..

జిల్లాలోని బీసీ కులాలకు చెందిన వారు సెల్ఫ్ ఫైనాన్స్ యూనిట్లకు 17, 478 దరఖాస్తులు అందించారు. జనరిక్ షాపులకు 50, మేదరి, కుమ్మరి కులాల నుంచి 146 దరఖాస్తులు వచ్చాయి. వైశ్య కులానికి సంబంధించి సెల్ఫ్ ఫైనాన్స్‌కు 901, జనరిక్‌కు రెండు దరఖాస్తులు వచ్చాయి. బ్రాహ్మణులు 53 మంది, క్షత్రియులు 50 మంది దరఖాస్తు చేశారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి 8 మంది, కాపుల నుంచి సెల్ఫ్ ఫైనాన్స్ యూనిట్లకు 675 మంది, జనరిక్ షాపులకు 21 మంది దరఖాస్తు చేశారు. ఈబీసీ నుంచి 43, కమ్మ సామాజిక వర్గం నుంచి 10 దరఖాస్తులు వచ్చాయి. గతంతో పోలిస్తే దరఖాస్తులు తక్కువగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని కులాల వారికి సెల్ఫ్ ఫైనాన్స్, జనరిక్ కలిపి రూ.71.33 కోట్లతో 3,379 యూనిట్లు లక్ష్యంగా నిర్ధారించారు.



గంట్యాడలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

హైవేపై వాహనాల పార్కింగ్

● రోడ్డుపై వెలగని విద్యుద్దీపాలు ● ఇబ్బంది పడుతున్న వ్యాపారులు ● ట్రాఫిక్‌కూ అంతరాయం

గజపతినగరం, మార్చి28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో స్థానికులు, వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతేడాది స్థానిక చంపావతి వంతెన నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 1.2 కిలోమీటర్లు జాతీయ రహదారి విస్తరణ జరిగింది. అలాగే మేజర్ పంచాయతీ గజపతినగరంతో పాటు పురిటిపెంట పంచాయతీలకు సంబంధించి రోడ్డు మధ్యలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య తొలగిపోతుందని స్థానికులు, వ్యాపారులు భావించారు. అయితే అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. రోడ్డు విస్తరణ తరువాత దుకాణాల ముందే ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతున్నారు. దాంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండని ఆవేదన చెందుతున్నారు. అలాగే రహదారి వెంబడి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు వెలగడంలేదు. చీకటి పడితే రోడ్డంతా అంధకారమే. తోపుడు బండ్ల వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఎస్ఐ లక్ష్మణరావు వివరణ కోరగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. నిబంధనలు పాటించని వారికి అపరాధరుసుం విధిస్తామన్నారు.


జాతీయ రహదారిపై నిలిపిన వాహనాలు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రాజాం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజాం-డోలపేట మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సంత కవిటి మండలం బొద్దూరు గ్రామానికి చెందిన దమయంతి తీవ్రంగా గాయపడ్డారు. కాలు విరిగిపోవడంతో పాటు శరీరంలో పలుచోట్ల గా యాలయ్యారు. రాజాంలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ఆమె శుక్ర వారం రాత్రి విధులు ముగించుకుని స్కూ టీపై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ ఇంజినీరింగ్ కళా శాల విద్యార్థి బలంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో మహిళను ఢీకొన్న విద్యార్థి రొక్కం కార్తీక్ సైతం గాయాల పాలయ్యాడు. వీరిద్దరూ రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు

పేకాట శిబిరంపై దాడి

మెరకముడిదాం, మార్చి 28(ఆంధ్ర జ్యోతి): మండలంలోని చినపూతికవలస శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం చీపురుపల్లి సీఐ శంకరరావు ఆధ్వర్యంలో బుదరాయవలస ఎస్ఐ లోకేశ్‌కుమార్ సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి నట్లు బుదరాయవలస ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,600 నగదు, మూడు ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నాయన్నారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

బొబ్బిలి/రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రకోట బొడ్డవలస గ్రామంలో కొండగొర్రె నీలమ్మ మెట్టు దగ్గర శుక్రవారం ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో పెద్దిరెడ్డి పోలరాజు (56)అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి సీఐ కటకం సతీష్‌కుమార్ వెళ్లి పరిశీలించారు. ఆయన కథనం ప్రకారం.. టేకు మొక్కలకు నీరు పోసేందుకు నీళ్ల ట్యాంకుతో ఉన్న ట్రాక్టర్‌ను పోలిరాజు నడుపుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పొలంలో ఎత్తుపల్లాలు బాగా ఉండటంతో ఎత్తు నుంచి దిగువకు వెళ్తున్న సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజిన్ కింద డ్రైవర్ పోలిరాజు ఉండిపోవడంతో ఆయన తల నుజ్జునుజ్జు అయింది. మృతుడి కుమారుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేశారు. సమాచారం తెలియగానే ఎమ్మెల్యే బేబీనాయన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుని బంధువులను పరామర్శించారు. పోలరాజు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం కాశయ్యపేట గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన బొబ్బిలి కోటలో డ్రైవరుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య లక్ష్మి ఇద్దరు పిల్లలు సూర్య నారాయణ, భవాని ఉన్నారు.

అప్రమత్తంగా ఉండండి

కొమరాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన రావు సూచించారు. మండలంలోని కందివలసలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో అనారోగ్య లక్షణాలను సకాలంలో గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యుడు సీహెచ్ అరుణ్‌కుమార్, ఏఎంవో సూర్యనారాయణ, పీహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుల వివక్ష కేసుపై దర్యాప్తు

భామిని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సోలికిరి గ్రామంలో కుల వివక్ష కేసుపై పాలకొండ డీఎస్పీ రాంబాబు శుక్రవారం దర్యాప్తు నిర్వహించారు. బాలేరు గ్రామానికి చెందిన లింగాల మోహనరావును సోలకిరి గ్రామా నికి కొత్తకోట గోవిందరావు కులం పేరుతో దూషించాడని బత్తిలి పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ సోలకిరి దర్యాప్తు నిర్వహించారు. పలువురి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఆయనతో బత్తిలి ఎస్ఐ అనిల్ కుమార్, వీఆర్వోలు రామారావు, శంకరరావు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి చర్యలు

గరుగుబిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యుల ఆర్థికాభివృ ద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని డీ ఆర్‌డీఏ పీడీ సుధారాణి అన్నారు. శుక్రవారం నవిరి గ్రామంలో ఎన్యుమ రేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాల్లో వార్షిక రుణ, జీవనోపాధులు ప్రణాళికలు ఏప్రిల్ 7లోగా ప్రణాళికలు పూర్తి చేయాలన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

మక్కువ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జీడి పంటకు మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ పార్వతీపురం ఐటీడీఏ వద్ద శనివారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకురాలు వి.ఇందిర కోరారు. మండలంలోని నగుళ్ల, దుగ్గేరు గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు.

సాంకేతికతను వినియోగించుకోండి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

రాజాం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే ఫలితం సులభంగా సాధించవచ్చన్నారు. ఇక్కడి ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 27వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వం సైతం సాంకేతికతకు పెద్దపీట వేస్తోందన్నారు. యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని శ్రీనివాస్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా కళాశాలతో తనకున్న నాలుగేళ్ల అనుబంధాన్ని విద్యార్థులకు మంత్రి గుర్తు చేసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం తానిక్కడే ఇంజినీరింగ్ పూర్తి చేశానన్నారు. ఆ రోజుల్లో ప్రతి వార్షికోత్సవంలో ఆటల పోటీల్లో విజేతగానో, సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందుతూ వేదికపైకి వచ్చేవాడినని ప్రస్తుతం మంత్రి హోదాలో రావడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో పద్మజాశ్రీరాం, డా.గిరీష్, డా.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు'


ఆందోళన చేస్తున్న క్రైస్తవ సంఘాల నేతలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ సమాజానికి తీరని లోటు అని, ఆయన మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయని క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.ఎం.రాజు అన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతిని నిరసిస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట క్రైస్తవ సంఘాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ మృతి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని క్రైస్తవ సమాజాన్ని కాపాడాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మధు, ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమానందం మాట్లాడుతూ ప్రవీణ్ మరణం ప్రమాదం కాదని, హత్య అనే అనుమానం అందరికీ ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలన్నారు. ఆందోళనలో క్రైస్తవ సంఘాల నేతలు ఎం.ఐజాక్, ఎం.పాల్‌సన్, వివేక్, సత్యరాజు, వెంకటరమణ, మనోహార్ తదితరులున్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాడుతాం


దీక్షా శిబిరంలో రెల్లి కులస్థులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన రెల్లి కులస్థులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని రెల్లి మేధావుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి ఆదిసురేంద్ర హెచ్చరించారు. నగరంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో రెల్లి కులాలకు న్యాయం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న నిరాహార దీక్ష శిబిరం శుక్రవారం ఐదోరోజుకు చేరింది. దీక్షాశిబిరాన్ని ఆదిసురేంద్ర సందర్శించి ఆయన మాట్లాడారు. రెల్లి వాటి ఉపకులాల మూలాలు పరిశీలించాలన్నారు. విజయనగరంలోనే 76 వేల మంది రెల్లి కులస్థులు ఉన్నారన్నారు. జనాభా ప్రాతిపదికన అధికంగా ఉన్నప్పటికీ వర్గీకరణలో తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ చేసి వర్గీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రవికుమార్, దుర్గారావు, రఘు, శ్రీను, గురునాథ్, అశోక్, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు తయారు చేయండి


మాట్లాడుతున్న డ్వామా పీడీ

విజయనగరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు 2025-26 వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళికలను తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ సభ్యులకు జీవనోపాధులు ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడికి రుణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేసేందుకు మొబైల్ యాప్ అందించామన్నారు. దానిలో ప్రతి సభ్యురాలి అప్పు, నిల్వ, కుటుంబ అవసరాలకు కావలసిన పెట్టుబడి వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి, డి.రత్నాకర్‌తో పాటు ఏరియా కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

మామిడికాయ రూ.25



జామి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండగ నేపథ్యంలో మామిడికాయలకు డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది స్థానికంగా దిగుబడి అంతంత మాత్రంగా ఉండటంతో ఒక్కో మామిడికాయను రూ.25 చొప్పున పట్టణంలో విక్రయిస్తున్నారు. స్థానికంగా పంట లేకపోవడంతో విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పట్టణంలో అమ్మకాలు చేపడుతున్నారు.

భూముల సంరక్షణలో అధికారులు విఫలం

●కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ధ్వజం


మాట్లాడుతున్న బంగార్రాజు

నెల్లిమర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 60లోని ప్రభుత్వ భూమిని అక్రమార్కులు ఆక్రమించుకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములను కాపాడేది ఎవరని వారు ప్రశ్నించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టౌన్ ప్లానింగ్ సమీక్ష సమయంలో సభ్యులు ఫైపాడ ప్రసాదరావు, లెంక అప్పలనాయుడు తదితరులు మాట్లాడుతూ సర్వే నెంబరు 60లోని చంద్రబాబునగర్ కాలనీలో కబ్జాల పర్వం కొనసాగుతోందన్నారు. అధికారులు ఏం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. నగర పంచాయతీ కార్యాలయం పక్కన బయిరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపాన్ని విస్తరిస్తే మేలు అని 6వ వార్డు కౌన్సిలర్ భర్త లెంక అప్పలనాయుడు కౌన్సిల్ ప్రస్తావించడంతో జనసేన నాయకులు రవ్వా నాని, అప్పికొండ రవికుమార్ అభ్యంతరం తెలిపారు. కల్యాణ మండపం పక్క స్థలాన్ని గతంలో ఓంశాంతి సంస్థకు అప్పగించారని, అదే స్థలాన్ని ఇప్పుడు కల్యాణ మండపంలో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. దాంతో కౌన్సిల్‌లో గందరగోళం నెలకొంది. దాంతో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కలుగజేసుకొని ఇరువర్గాలను వారించారు. నెల్లిమర్ల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కమిషనర్ కె.అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోండి


మాట్లాడుతున్న ఏపీడీ రమామణి

శృంగవరపుకోట రూరల్,మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పద్ధతి మార్చుకోకుంటే ఉద్యోగాలు కోల్పోవడం ఖాయమని ఏపీడీ రమామణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తనిఖీలు చేసిన ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ కొందరు ఉద్యోగులు వందరోజుల పని కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. మండలంలో 10282 జాబ్ కార్డులు ఉంటే 1890 మందికి వంద రోజులు పనిదినాలు కల్పించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మస్తర్లు వెరిఫికేషన్‌లో కమిషనర్ చాలా కఠినంగా ఉన్నారన్నారు. ఇటీవల 73 మందిని టెర్మినేట్ చేసిన విషయం వివరించారు. సోషల్ ఆడిట్‌లో మస్తర్లు లేకుండా డబ్బులు చెల్లింపు, దిద్దుబాట్లు, పలు చెల్లింపులలో తేడాలు వివరించారు. వీటిపై కొంతమంది క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి తదితరున్నారు.

ప్రజావేదికలో తప్పులు బహిర్గతం

దత్తిరాజేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండ పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, ప్రొసీడింగ్ అధికారి పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావేదికలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 35 పంచాయతీల్లోని గ్రామాల్లో రూ.19.26 కోట్లతో నిర్వహించిన 1309 పనులపై ఆడిట్ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పనులకు వెళ్లినట్టు డబ్బులు చెల్లించి సంతకాలు తీసుకోలేదని, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించారు. రికార్డుల్లో ఉన్న మొక్కల సంఖ్యకు క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కలకు పొంతన లేదని అధికారులు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ మన్మథరావు, ఏపీవో వెంకటప్పలనాయుడు, సత్యవతి పాల్గొన్నారు.

విధుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గంట్యాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వర్రి దేముడును విధుల నుంచి తప్పిస్తూ డ్వామా పీడీ శారదా దేవి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ దేముడు గ్రామంలోని వేతన దారులకు పనులు కల్పించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండటంతో ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో 'ఉపాధి పనులకు ఎదురుచూపు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి డ్వామా పీడీ స్పందించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేయించారు. అతడిని బాధ్యతల నుంచి తప్పించారు.

గెడ్డ ఆక్రమణను నిలువరించండి


గెడ్డలో వేసిన కాంక్రీట్ స్తంభాలు

చీపురుపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లేదారిలో అమ్మవారి పాదాలకు సమీపంలో కొంతమంది పెద్ద గెడ్డను ఆక్రమించారు. అనధికార కట్టడాలు చేపడుతున్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గెడ్డలో కొందరు వ్యక్తులు అనధికారికంగా చేపట్టిన నిర్మాణం వల్ల వరదనీరు సక్రమంగా ముందుకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. భవిష్యత్తులో రోడ్డుపైకి వచ్చే ప్రమాదం ఉందన్నారు. అక్రమ నిర్మాణాన్ని నిలువరించే చర్యలు చేపట్టాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

గురుదేవకు 'ఐడీబీఐ' సాయం


దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేస్తున్న బ్యాంక్ ప్రతినిధులు

కొత్తవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గురుదేవ చారిటబుల్ ట్రస్టుకు ఐడీబీఐ (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్) పూర్తి సహకారం అందిస్తుందని ఆ బ్యాంక్ విశాఖపట్నం జీఎం కన్వాదీప్ దాస్, రీజనల్ కో-ఆర్డినేటర్ సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మంగళపాలెంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టును వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుదేవ ట్రస్టులో తామూ భాగస్వాములు కావాలని మూడు నెలలుగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలతో పాటు వివిధ రకాల ఉపకరణాలను అందించేందుకు గుర్తింపు కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా 750 మందికి కృత్రిమ అవయవాలు. ఉపకరణాలను అందజేశామన్నారు. భవిష్యత్తులో కూడా తమ ఐడీబీఐ ద్వారా సేవాకార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఉపకరణాలను అందించడం.. మరోపక్క గురుదేవ ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు, క్యాన్సర్ రోగుల కోసం ఉప్పలపాటి విజయశ్రీ మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు బాగ్‌చంద్ అగర్వాల్, పీవీ నారాయణరావు, ట్రస్టు వైస్ చైర్మన్ ఫణీంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వేపాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త బొద్దాం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బసనబోయిన కార్తీక్ (21) మృతి చెందాడు. తన స్నేహితులతో కలిసి ఎస్.కోట నుంచి స్కూటీపై ఎల్.కోట పండగకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టింది. స్కూటీపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కార్తీక్ మృతి చెందినట్టు మృతిడి కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

భామిని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పసుకుడి గ్రామానికి చెందిన మువ్వాల జయరాం(17)వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయాల పాలయ్యాడు. శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. గత శుక్రవారం జయరాం తన అక్క రాణి, తమ్ముడు మనోజ్‌తో కలిసి బైకుపై పసుకుడి గ్రామం నుంచి లివిరి యాత్రకు బయలుదేరాడు. భామిని సమీపంలోకి వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్ర గాయాలపాలైన జయరాం, రాణిలను శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. జయరాం మృత్యువుతో పోరాడి వారం రోజుల తర్వాత తుదిశ్వాస విడిచాడు. బత్తిలి ఎస్ఐ అనీల్‌కుమార్ కేసు నమోదు చేశారు. శవ పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. జయరాం భామిని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. చేతికందిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు భవానీ, అప్పలనాయుడు కన్నీరుమున్నీరయ్యారు. ప్రస్తుతం రాణి శ్రీకుకుళం ప్రైవేట్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతోంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

దత్తిరాజేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని తోటలో సీతానగరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన చెమరపల్లి వినోద్‌కుమార్ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గడ్డి మందు సేవించిన సదరు వ్యక్తిని అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పీహెచ్‌సీకి తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు.

పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో విజయనగరంలో గోకపేటకు చెందిన కంది సన్యాసిరావు అలియాస్ సిద్ధూ (19)కు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10,500 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలికతో గోకపేటకు చెందిన సిద్ధూ ఫేస్‌బుక్‌లో పరిచయం పెంచుకుని ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తరచూ తన ఇంటికి తీసుకువెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గర్భవతిని చేసి పెళ్లికి నిరాకరించాడు. దాంతో ఆమె విజయనగరం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ స్వర్ణలత పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి దిశ మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ త్రినాథ్ దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా మహిళా పీఎస్ సీఐ నర్సింహమూర్తి చర్యలు చేపట్టారు. సన్యాసిరావు నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయాధికారి నాగమణి తీర్పుని వెల్లడించారన్నారు. కేసులో బాధితురాలికి రూ.2 లక్షల నష్టపరిహారాన్ని మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు.

చీపురుపల్లిలో చోరీ

చీపురుపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తగవిడివీధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సిద్ధార్థ కాన్వెంట్‌కు ఎదుట వై.లక్ష్మణరావు ఇంట్లోకి చొరబడి అర కిలో వెండి, పాతిక వేలు నగదు అపహరించారు. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఇంటి ఆవరణలోకి ప్రవేశించిన దొంగలు, కిటికీలకు బిగించిన ఇనుప ఫ్రేమ్‌లను తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. హాలుల్లో వివిధ ప్రదేశాల్లో ఉంచిన పాతిక వేలు నదగు, పూజా గదిలో ఉన్న సుమారు అర కిలో వెండి సామగ్రి ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీం, సంఘటనా స్థలానికి చేరుకొని, ఆధారాలను సేకరించింది. సమీపంలో ఉన్న సీసీ టీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇఇలా ఉండగా అంతకు ముందు, సమీపంలో ఉన్న మరో ఇంట్లోకి కూడా దొంగలు చొరబడి విలువైన వస్తువులు దొంగిలించినట్టు తెలిసింది.

క్రికెట్ బెట్టింగ్: వ్యక్తి అరెస్టు

బొండపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లాంలో ఓ ఇంటిలో టీవీ చూస్తూ ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ యు.మహేష్ శుక్రవారం తెలిపారు. బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.90,500ల నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లో ఉన్న బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి మరో ఐదుగురు వివరాలను తెలుసుకునేందుకు యత్నిస్తున్నామన్నారు.

25 కేజీల పాలిథిన్ కవర్లు సీజ్

రాజాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘం పరిధిలోని కూరగాయల దుకాణాలు, మాంసం దుకాణాలపై శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్ దాడులు చేపట్టారు. సుమారు 25 కేజీల పాలిథిన్ కవర్లను సీజ్ చేశారు. ఎవరైనా విక్రయించినా, వినియోగించినా వారికి రూ.500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేవస్థానం ప్రాంగణంలో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బాల హెచ్చరించారు. తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను గుర్తించి తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సూర్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, సర్వేయర్ ఎస్.గాంధీ, వీఆర్వో టి.రవికుమార్, దేవస్థానం అభివృద్ధి కార్యదర్శి డా.డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

పాలకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా జైళ్ల శాఖాధికారి కె.మోహన్‌రావు సూచించారు. పాలకొండ సబ్ జైలును ఆయన శుక్రవారం సందర్శించారు. జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజలను చైతన్యవంతులు చేయండి


మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

రాజాం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో ప్రజలను చైతన్యవంతులుగా చేయాల్సిన బాధ్యత మహిళా పోలీసులదేనని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు స్పష్టం చేశారు. రాజాం టౌన్, రూరల్ సర్కిళ్ల పరిధిలోని మహిళా కానిస్టేబుళ్లతో శుక్రవారం స్థానిక ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గంజాయి, మత్తుపదార్థాల నిషేధం, సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌ల వల్ల కలగనున్న అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్రరావు, ఎస్ఐలు, ఎఎస్.ఐలు, హెచ్‌సీలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి 'కొండగుంపాం' ప్రాజెక్ట్


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

నెల్లిమర్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగుంపాం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈఎండీపీవో భాగంగా విద్యార్థులచే తయారు చేసిన ప్రాజెక్టు జిల్లాస్థాయికి ఎంపికైంది. ఏప్రిల్ 2న ఈ ప్రాజెక్టును విజయనగరంలో 9వ తరగతి విద్యార్థులు లెంక జాహ్నవి, పతివాడ యోగిత, పతివాడ భానుమతి ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగాదద విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.ప్రసాద్, ఈఎండీపీ గైడ్ టీచర్లు సంజయ్‌కుమార్, పి.సత్యప్రకాశ్ అభినందించారు.

సెంచూరియన్‌లో ఫ్రెషర్స్‌డే

నెల్లిమర్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైస్ ఛాన్స్‌లర్ ప్రశాంత్‌కుమార్ మహంతి లాంఛనంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో ముందుకు సాగినపుడే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలలో స్థిరపడగలరన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్.వర్మ మాట్లాడుతూ విద్యార్థులు తోటి విద్యార్థులతో హద్దులు మీరకుండా మెలగాలన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు డాక్టర్ ఆర్ఎస్.వర్మ తదితరులు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా 'మల్లు'


మల్లునాయుడు

లక్కవరపుకోట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు చొక్కాకుల మల్లునాయుడుకు కొత్తవలస మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరించింది. సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే లలితకుమారిలకు మల్లునాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మల్లునాయుడు నియామకంపై మండల పార్టీ నేతలు కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, శ్రీనాధు పెదబాబు, కొట్యాడ ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ పోలీసులకు చలువ కళ్లద్దాలు

విజయనగరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ట్రాఫిక్ పోలీసులకు వేసవి దృష్ట్యా చలువ కళ్లద్దాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను శుక్రవారం ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు జి.శిరీష, కల్పన కుక్రేజా, వైశాలి, లక్ష్మీశ్రీనివాస్ తదితరులు అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు శిరీష మాట్లాడుతూ క్లబ్ తరఫున పలు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే ట్రాఫిక్ పోలీసులు చలువ కళ్లద్దాలు అందజేశామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం.. అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ

విజయనగరం దాసన్నపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు వెళ్లడం అభినందనీయమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కొనియాడారు. శుక్రవారం సీమెన్స్ టాటా స్ట్రైవ్‌లు సంయుక్తంగా గాజువాక డ్యూయల్ వీఈటీలో ప్రాజెక్టు ఇన్నోవేషన్ ఛాలెంజ్ కాంపిటేషన్‌ను నిర్వహించాయి. కార్యక్రమంలో 30 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విజయనగరానికి చెందిన ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు మెకానిక్ విభాగంలో ఈగల్ ప్రాజెక్టును ప్రదర్శించి ప్రథమ బహుమతి బహుమతి సాధించారు. 16 బైక్ చైన్‌లతో 2,500 చైన్‌లింక్స్‌తో ఈగల్ ప్రాజెక్టును తయారు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవిరావు మాట్లాడుతూ ఈగల్ ప్రాజెక్టును చూడముచ్చటగా రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నర్సింహపాత్రుడు, ఆర్‌వీ రమణ, బాలాజీ, శ్రీనివాసరావు, రమేశ్, ప్రిన్సిపాల్ టీవీ గిరి ఉన్నారు.

పోస్టల్ డివిజన్లపై సమీక్ష

విజయనగరం రింగురోడ్డు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ కార్యాలయంలో శుక్రవారం విజయనగరం, విశాఖపట్టణం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి పోస్టల్ డివిజన్లపై ఏపీ పోస్టల్ సర్కిల్ ఐవీపీఎస్ కె. సంతోష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం సంబంధించి పీవోఎస్‌బీ నెట్ ఎడిషన్ పొదుపు ఖాతాలు 110 సాధించామన్నారు. ఆర్‌పీఎల్ఐ ప్రీమియం 100.204 శాతం, పీఎల్ఐ ప్రీమియం 92.78 శాతం, 3,880 సుకన్య సమృద్ధి ఖాతాలు తెరవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అన్ని క్యాటగిరీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోస్టల్ శాఖ సిబ్బందిని ఆయన సత్కరించారు. కార్యక్రమంలో విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. అదానీతో చేసుకున్న సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరారు. శుక్రవారం ఎంఆర్ కళాశాల జంక్షన్‌లోని ప్రాంతీయ విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎటువంటి చార్జీలు పెంచమని చెబుతూనే ట్రూ అప్ చార్జీల పేరిట ఇప్పటికే రూ.17 వేల కోట్ల భారం ప్రజలపై వేసిందన్నారు. సెకీ ఒప్పందం ప్రకారం మరో రూ.8 వేల కోట్ల భారం ప్రజలపై వేయడానికి సిద్ధమవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు రమణమ్మ, జగన్, సురేష్, వి.లక్ష్మి, రవి, రాజు, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు. సెకీ ఒప్పందం అమలుకు జోరుగా అడుగులు

● చీపురుపల్లి: సెకీ ఒప్పందాన్ని అమలు చేయడానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తొందరగా అడుగులు వేస్తోందని సీపీఎం ఆరోపించింది. విద్యుత్ చార్జీల విషయంలో ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. సెకీ ఒప్పందం అమలుకు నిరసనగా ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆ పార్టీ కార్యకర్తలు విద్యుత్ బిల్లులు తగలబెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంబల్ల గౌరునాయుడు, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

చివరి మజిలీకీ కష్టమే..

● శ్మశానవాటిక లేక ఇబ్బంది పడుతున్న అలజంగి గ్రామస్థులు


అలజంగిలో నది ఒడ్డున ఉన్న శ్మశానవాటిక

బొబ్బిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి గ్రామానికి శ్మశానవాటిక లేకపోడవంతో ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మరణించినవారికి గ్రామ శివారున ఉన్న స్థానిక వేగావతి నది ఒడ్డున అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో నదిలో నీటి ప్రవాహం పెరుగుతుంది. దీంతో నది దాటడా నికి ఇబ్బంది పడాల్సి వస్తుంది. అలాగే వేసవిలో అంత్యక్రియలు నిర్వహించడానికి వచ్చే వారికి కనీసం నిలువ నీడ ఉండదు. కనీస వసతులు ఉండవు. ఈ సమస్యను గత ప్రభుత్వంలో అనేకసార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

● ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, రెవెన్యూ అధికారులతో చర్చించి శ్మశానవాటిక నిర్మిస్తామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు.

రూ.2 కోట్లే ఇచ్చారు

(3వ పేజీ తరువాయి)

ప్రకటించింది. దీనిలో భాగంగా బొబ్బిలి నియోజకవర్గం రామభద్రపురం మండలం కొట్టక్కిలో ఈ పార్కు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఏపీఐఐసీకి 187 ఎకరాల భూములు ఉన్నాయి. తొలుత తెర్లాం మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను అధికారులు పరిశీలించారు.

మాకు ప్రయోజనం లేదు

గ్రోత్‌సెంటర్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. ఈ విషయమై అనేక దఫాలు ప్రభుత్వ పెద్దలకు అనేక వేదికలపై మొరాఎట్టుకున్నాం. స్థానికులకు ఉపాధి కల్పించకుండా బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి మనుషులను తీసుకొచ్చి పనులు చేయించుకుంటున్నారు. ఇది చాలా అన్యాయం. అధికారులు మాకు న్యాయం చేయాలి.

-పువ్వల మాధవరావు, సర్పంచ్, మెట్టవలస

రూ.2 కోట్లతో పనులు చేస్తాం

గ్రోత్‌సెంటర్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులు ఎంతవరకు సరిపడితే అంతవరకు పనులు చేస్తాం. గ్రోత్‌సెంటర్‌లోని సుమారు 150 అసెస్‌మెంట్ల నుంచి రూ.కోటి ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉంది. పరిశ్రమల నిర్వాహకులు సక్రమంగా చెల్లించడం లేదు. ఇంతవరకు రూ.20 లక్షలు మాత్రమే వసూలైంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో స్థలాల సేకరణ జరుగుతోంది. బొబ్బిలికి సంబంధించి కొట్టక్కిలో 187 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. కొత్తపరిశ్రమల ఏర్పాటుకు చాలా మంది సంప్రదింపులు జరుపుతున్నారు.

-మురళీమోహన్ డీజెడ్‌ఎం, ఏపీఐఐసీ


గ్రోత్‌సెంటరుకు వెళ్లే దారిలో ధ్వంసమైన రహదారి

గాడిలో పెడతాం

గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమలు పెడితే ఏవేవో సమస్యలు వస్తాయని కొంతమంది రియల్టర్లు కుట్రపూరితంగా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. వారి స్వార్థం కోసం ఈ తరహా ప్రచారానికి పూనుకుంటున్నారు. దీనిని తిప్పి కొడతాం. గ్రోత్‌సెంటర్‌ను ప్రక్షాళన చేస్తాం. భారీ పరిశ్రమలు త్వరలో రానున్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, నిరుద్యోగులు దీనిపై ఆశాజనకంగా ఉన్నారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా భరోసా ఇచ్చారు. గ్రోత్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో గాడిలో పెడతామని మంత్రి చెప్పారు.

-బేబీనాయన, ఎమ్మెల్యే, బొబ్బిలి

హెల్డోవర్ సమస్య పరిష్కారమయ్యేనా?

(3వ పేజీ తరువాయి)

చూపారు. చివరకు పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన రైతులు ఈ సమస్యతో ఇబ్బందులు పడుతుండడాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టి లో పెట్టారు. అలాగే, ప్రభుత్వం దృష్టిలో కూ డా పెట్టారు. సమస్య పరిష్కారానికి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ గత డిసెంబరులో భూపరి పాలన శాఖకు లేఖ రాశారు. గ్రామాల వారిగా ఉన్న భూముల వివరాలను పొందుపరిచారు. ప్రభుత్వం కూడా భూ సమస్యల పరిష్కారానికి చొరవచూపుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రధానంగా భూ సమ స్యలపై ఎక్కువగా ప్రస్తావించారు. దీంతో హెల్డోవర్ భూములకు పరిష్కారం దొరుకు తుందని రైతులు నమ్మకంగా ఉన్నారు. భూ యాజమాన్య హక్కుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఆటో డ్రైవర్‌కు ఎమ్మెల్యే అభినందన

బొబ్బిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈనెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను సకాలంలో ప్రభుత్వాసుపత్రికి తరలించిన ఆటో డ్రైవర్ కోరుకొండ రమణబాబును ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం అభినందించారు. స్థానిక దర్బారు మహల్‌కు రమణబాబును కుటుంబంతో సహా రప్పించి అభినందించారు. ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ప్రమాద సమయాల్లో మానవత చాటుకోవడం హర్షణీయమని అన్నారు.

వివాద స్థలాలు పరిశీలించిన హర్షకుమార్

బొబ్బిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. బొబ్బిలి పట్టణంలో అసైన్డ్ భూములకు సంబంధించి నడుస్తున్న వివాద స్థలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మువ్వల శ్రీనివాసరావు, సీపీఐ నాయకుడు ఒమ్మి రమణలతో పాటు మరికొంతమంది మల్లమ్మపేట రెవెన్యూ పరిధిలో గల భూములను ఆయనకు చూపించారు. అనంతరం హర్షకుమార్ విలేకర్లతో మాట్లాడారు. 1991లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన తొమ్మిది ఎకరాల డి.ఫారం భూములను అధికార బలం చూపి ప్లాట్లు వేస్తున్నట్లు తెలిసిందన్నారు. దీనికి కూటమి ప్రభుత్వం సీఎం, డిప్యూటీ సీఎంలు మద్దతు పలకడం సరికాదన్నారు. బీసీల ప్రభుత్వమని చెప్పి బీసీల దగ్గర భూములను లాక్కొని ఓసీలకు ఇస్తారా.. అని ప్రశ్నించారు.

నిరాధార ఆరోపణలు వద్దు

బొబ్బిలి/రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనపై నిరాధార ఆరోపణలు చేస్తే తస్మాత్ జాగ్రత్త అని తెలుగు యువత పార్లమెంటరీ కార్యదర్శి కాగాన సునీల్ కుమార్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ హర్షకుమార్ శుక్రవారం బొబ్బిలి పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే బేబీనాయన, కూటమి ప్రభుత్వంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నానని అన్నారు. హర్షకుమార్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

2 నుంచి సదరం సర్టిఫికెట్ల పరిశీలన

బొబ్బిలి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్‌దారుల సదరం సర్టిఫికెట్లను రాజాం ఏరియా ఆసుపత్రిలో ఏప్రిల్ 2 నుంచి 4వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు వైద్యాధికారులు పరిశీలించి, ధ్రువీకరించనున్నట్టు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 2వ తేదీన దిబ్బగుడ్డివలస, గోపాలరాయుడుపేట, జగన్నాథపురం, కలవరాయి, 3వ తేదీన కలవరాయి, కమ్మవలస, కారాడ, కాశిందొరవలస, కోమటిపల్లి, 4వ తేదీన కోమటిపల్లి, ఎం.బూర్జవలస, మెట్టవలస గ్రామాల దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్టు తెలిపారు.

ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

బొబ్బిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ రాజమహేంద్రవరం సమీపంలో అనుమానాస్పద స్థితిలో మరణించిన నేపథ్యంలో ఈ కేసులో ఉన్న మిస్టరీని ఛేదించాలని ఏఈఎల్‌సీ డెలిగేట్ జేసీ రాజు శుక్రవారం డిమాండ్ చేశారు. సమగ్ర దర్యాప్తు జరిపి, పోస్టుమార్టం నివేదికను బహిర్గతం చేయాలన్నారు. మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా నూకాలమ్మ ఊరేగింపు

విజయనగరం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం నూకాలమ్మ తల్లి ఉత్సవ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా నగరంలోని కర్రల మార్కెట్ వద్ద నూకాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. శుక్రవారం విచిత్ర వేషాలతో నూకాలమ్మ పల్లకిలో తరలిరాగా, ఆ పల్లకి ముందు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక


ఇంటర్వ్యూలకు హాజరైన లబ్ధిదారులు

బొబ్బిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. 504 మంది దరఖాస్తు చేసుకోగా 486 మంది హాజరయ్యారు. వీరిలో 89 మందికి మాత్రమే బీసీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేస్తుంది. ఒక్కో లబ్ధిదారునికి రూ.2లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తారు. అందులో రూ.85వేల మేర సబ్సిడీ ఉంటుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, బీసీ కార్పొరేషన్ కార్యాలయం నుంచి రమణమ్మ, టీపీఆర్‌వో జగన్మోహనరావు, సీఎంఎం లలిత, 18 బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. ● రామభద్రపురం: మండల కేంద్రంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 71 యూనిట్లకు గానూ 455 మంది దరఖాస్తు చేయగా 449 మంది హాజరయ్యారు. వీరికి స్టేట్ బ్యాంకు మేనేజర్ హరీంద్ర, యూనియన్ బ్యాంకు మేనేజర్ స్వరాజ్, బూసాయవలస యనియన్ బ్యాంకు మేనేజర్ వాసు ఇంటర్వ్యూ నిర్వహించారు. జడ్పీటీసీ అప్పికొండ సరస్వతమ్మ, మండల పరిషత్ ఏవో సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి గాయక సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న కవులు, గాయకులు

విజయనగరం రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గురజాడ గృహంలో కవిగాయక సమ్మేళనం నిర్వహించారు. కవులు, రచయితలు, సాహితీవేత్తలు, నగర ప్రముఖులు, వివిధ స్వచ్ఛంద, కళాకారుల సేవా సంఘ ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రముఖ కవి పాయల మురళి, కొత్తార్తి శ్రీనివాసరావు, చల్లపిల్ల శ్యామల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమకాలీన, సామాజిక అంశాలపై 50 మంది కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి తరఫున చీగటి దివాకర్, చంద్రికారాణి, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

రామభద్రపురం, మార్చి 28 (ఆంధ్రజ్యూతి): శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు కీలకంగా వ్యవహరించాలని ఎస్ఐ వెలమల ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చోరీలు, లైంగిక వేధింపులు, మత్తు పదర్థాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు.

పాఠశాల విలీనం తగదు

బొబ్బిలి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కారాడ గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో 6, 7, 8 తరగతులను అలజంగి ఉన్నత పాఠశాలలో విలీనం చేయొద్దని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె ఆ గ్రామాన్ని సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, పాఠశాల విలీనంపై అభిప్రాయం తెలుసుకున్నారు. పాఠశాల విలీనాన్ని ఆపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, బొబ్బిలి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, వెంకటరావు, కృష్ణదాసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

ఆ లేఅవుట్ ఎల్‌ఆర్ఎస్‌పై అభ్యంతరాలు ఉంటే తెలపండి


నోటీసు బోర్డులో వివరాలు ప్రదర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని మల్లమ్మపేట రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 207/పీ లో 2.136 ఎకరాల భూమిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోగా తమ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ స్థలంలో 42 ప్లాట్లతో కూడిన అనధి కార లేఅవుట్‌ను ఇన్‌ప్రిన్సిపల్ లేఅవుట్‌గా ఈనెల 25న ఆమోదించినట్లు తెలిపారు. లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం కింద జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఇన్‌ప్రిన్సిపల్ లేఅవుట్‌గా ఆమోదించామన్నారు. అభ్యంతరాలున్న వారు 15 రోజుల్లోగా తమకు లిఖితంగా తెలియజేయాలన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలను బహిర్గతం చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజరు దీక్షితులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.